క్లుప్తంగా

ప్రశాంతంగా ఫీల్డ్ అసిస్టెంట్ పరీక్ష

యానాం: పుదుచ్చేరి ల్యాండ్ అండ్ సర్వే శాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం యానాంలో ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 567 మంది రాతపరీక్షకు దరఖాస్తు చేసుకోగా 426 మంది హాజరయ్యారని, 141 మంది గైర్హాజరయ్యారని ఆర్ఏఓ మునిస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్‌పీఐ మండల అధ్యక్షుడిగా రేవు శ్రీనివాస్



ఐ.పోలవరం మండల ఆర్‌పీఐ నూతన కార్యవర్గం

ఐ.పోలవరం: భారత రిపబ్లికన్ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ పిలుపునిచ్చారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా రేవు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా వెంటపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా యలమంచిలి సురేష్, కోశాధికారిగా నక్కా దుర్గాప్రసాద్‌లను నియమించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాస్, పాము అంబేడ్కర్, పంతగడ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి



పొలంబడిలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరంలో ఆదివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేయర్స్, టార్పాలిన్స్ అందించాలని రైతులు ఎంపీడీఓని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు శుభ గణేష్, కొనుకు బాపూజీ, బొక్కా శ్రీను, బొక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



అల్లవరంలోని ఓ ఇంటి వద్ద బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అల్లవరం: అల్లవరం-1 సచివాలయంలో ఈ నెల 24న నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిమిత్తం అల్లవరం సచివాలయంలో ఏఎన్ఎం, వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వేని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదివారం పరిశీలించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులకు బీపీ, షుగర్, రక్త శాతం పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరంపై ఇంటింటా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఎంపీడీఓ కృష్ణమోహన్ సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గంగాభవాని, వలంటీర్ పాల్గొన్నారు.

వాసవీ మాత దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దసరా ఉత్సవాలు నిర్వహణకు పట్టణ వైశ్య సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలకు సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో వాసవీ మాత విగ్రహం చెంత ఉంచి ఏర్పాట్లకు ఆదివారం శ్రీకారం చుట్టారు. అనంతరం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు వంకాయల కాశి, సంఘ అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, నంబూరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అదరగొడుతున్న ఆహా క్యాంటీన్

- రుచికరమైన ఆహారం.. సరసమైన ధరలకు లభ్యం
- ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పేదలకు సేవలు

అమలాపురం టౌన్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదల ఆకలి తీర్చేందుకు ఆహా క్యాంటీన్‌కు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరలకే అందిస్తుండడంతో అందరి మన్ననలు పొందుతోంది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయాన్ని పెంచడంతో పాటు నిర్ణీత ధరలకే అందరికీ రుచి, శుచి ఉన్న ఆహారం అందించే లక్ష్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పర్యవేక్షణలో క్యాంటీన్ నడుస్తోంది.

అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఈ ఏడాది ఆగస్టు 24న ఆహా క్యాంటీన్ ప్రారంభించారు. పట్టణానికి చెందిన లూర్ద్ మాతా స్వయం సహాయక సంఘం ప్రతినిధి నూకపెయ్యి నాగ వరలక్ష్మి ఈ క్యాంటీన్‌ను ఏడాది కాల పరిమితితో నిర్వహిస్తున్నారు. క్యాంటీన్‌లో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ మొత్తంగా 13 రకాల వంటకాలు అందుబాటులో ఉంటాయి. ఇక్కడి ధరల్లో అత్యధికంగా రూ.45 మించి ఏ ఆహారం ధర లేకపోవడం విశేషం. బయటి మార్కెట్‌లో లభ్యమయ్యే భోజనం, అల్పాహారం ధరలతో పోలిస్తే నామమాత్రపు లాభార్జనతో ప్రజలకు మేలు చేసేలా ఆహా క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆహారాన్ని పూర్తిగా ప్యాకేజ్డ్ పద్ధతిలోనే అందిస్తారు. ఈ క్యాంటీన్‌లో రోజుకు 80 నుంచి 100 మంది ఆహార ప్యాకెట్లు కొనుగోలు చేయడం ద్వారా నిర్వాహక డ్వాక్రా సంఘం రూ.1,800 వరకూ వ్యాపారం చేస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సందర్శకులతో పాటు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చినవారు సైతం ఆహా క్యాంటీన్ సేవలను వినియోగించుకుంటున్నారు.



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్

ఆదరణ పెరుగుతోంది



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. తక్కువ ధరలతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇవ్వడం వల్ల అందరూ క్యాంటీన్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆసుపత్రికి వస్తున్నవారే కాకుండా బయటి వ్యక్తులు కూడా ఇక్కడ ఆహారం తింటున్నారు.

– వి.రామలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్, మెప్మా, అమలాపురం

క్యాంటీన్‌లో లభ్యమయ్యే ఆహార పదార్థాల ధరల వివరాలు

ఆహారం పేరు	ధర(రూ.ల్లో)
1. ఇడ్లీ-3	20
2. దోసె-1	20
3. మైసూర్ బజ్జీ-4	20
4. పూరీ -2	25
5. మినపట్టు-1	20
6. టీ-1	5 నుంచి 10
7. ఒక కప్పు పాలు	10
8. మీల్స్-1	45
9. లెమన్ రైస్	35
10. పుదీనా రైస్	35
11. జీరా రైస్	35
12. వెజిటబుల్ బిర్యానీ	40
13. పెరుగు అన్నం	25

శాలివాహన కమిటీ సభ్యునిగా టిళ్లపూడి నాగేశ్వరరావు



కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

తాళ్లరేవు: జిల్లా శాలివాహన సంక్షేమ అభివృద్ధి కమిటీ సభ్యునిగా సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావును నియమించారు. ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లా ధ్రువీకరణ పత్రం ఇచ్చినట్లు నాగేశ్వరరావు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా టిళ్లపూడి నాగేశ్వరరావును సంఘ రాష్ట్ర డైరెక్టర్ బిల్లకుర్తి శివాజీ, రాష్ట్ర శాలివాహన సంఘం చైర్మన్ ఎం.పురుషోత్తమ్, ర్యాలి సత్యనారాయణ, గుత్తుల వెంకటరమణ, కేశనకుర్తి చిన్న తదితరులు అభినందించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పట్టుకున్న నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఈబీ అధికారులు

అమలాపురం టౌన్: యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్(ఎన్‌డీపీ) మద్యాన్ని తరలిస్తున్న అదే ప్రాంతానికి చెందిన బొడ్డు కామేశ్వరరావును అమలాపురం ఎస్ఈబీ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. కామేశ్వరరావు మోటారు సైకిల్‌పై 160 మద్యం సీసాలను తరలిస్తుండగా అయినవిల్లిలంకలో ఎస్ఈబీ ఎస్ఐ సీహెచ్ స్వామిరెడ్డి, సిబ్బంది పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి మద్యాన్ని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్ఈబీ సిబ్బంది నూతనప్రసాద్, బి.కరుణ, ఏవీ సీతారామరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆదివారం కోరింగా ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ఏఏ రకాలైన మత్స్య సంపదను వేటాడాలి, వేటిని కాపాడాలి అనే అంశాలను మత్స్యకారులకు వారి గ్రామాలకు వెళ్లి వివరించినట్లు తెలిపారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పర్యవేక్షణలో బాలబాలికలకు బయో డైవర్సిటీపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, ఎఫ్‌బీఓ ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన చిత్రాన్ని చూపిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి

పితృకర్మలు అత్యంత శుభప్రదం

అమలాపురం రూరల్: సమాజంలో పితృకర్మలంటే అశుభ కార్యమనే దురభిప్రాయం ఉందని, కాని పితృకర్మలు అత్యంత శుభప్రదమైనవని బ్రహ్మశ్రీ వేము వెంకట శివకుమార్ అన్నారు. షోడశరాత్రి పితృదేవతా పూజా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అష్టదిక్పాలక, నవగ్రహ, యమావహన, యమ అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పితృలకు మోక్షం కలగజేసే ఈ మహోత్సవానికి భక్తులు తరలివచ్చి సామూహిక పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో సాధకులు లింగోలు శిరీష, తూము దొరబాబు, గొవ్వాల అచ్యుతరామయ్య, అరిగెల బుజ్జి, పోతురాజు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



పితృ దేవతా మహోత్సవాల్లో పూజలు చేస్తున్న భక్తులు

సినీ గేయ రచయిత సూర్యకు సత్కారం

అమలాపురం టౌన్: వర్ధమాన సినీ గేయ రచయిత శ్రీనివాస సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు అమలాపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సత్కరించారు. అమలాపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాస సూర్య మిస్టరీ, ఒక్కడే చిత్రాలకు పాటలు రాశారు. ఈ సినిమాలు ఈ దసరాకు విడుదల అవుతున్న నేపథ్యంలో శ్రీనివాస సూర్యను కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోనసీమ సినీ ఆర్టిస్టులు భద్రాజీ, ఎరుబండి చంటి, దుర్గారావు, ఆదుర్తి శ్రీనివాస్, నాయుడు, వెంకీ, దాస్ తదితరులు పాల్గొన్నారు.



సినీ గేయ రచయిత సూర్యను సత్కరిస్తున్న కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు

ముగిసిన చిత్ర కళా ప్రదర్శన

అమలాపురం రూరల్: క్రియేటివ్ హార్ట్స్ ఆధ్వర్యంలో కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన వందే వేద భారతం కార్యక్రమంలో నిర్వహించిన రామాయణ, మహాభారత, భాగవతం అంశాలపై చిత్రకళా ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ సభకు ప్రముఖ చిత్రకారుడు ఎస్.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో 360 మంది పైగా చిత్ర కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు రాంబాబును అకాడమీ అధ్యక్షుడు ఆకొండి అంజి, ఎస్ఎస్ఈ సీఎంవో సుబ్రహ్మణ్యం, సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్ తదితరులు సత్కరించారు.



చిత్రకారుడు రాంబాబును సత్కరిస్తున్న సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ తదితరులు

వైద్యం కోసం సాయం

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యం చేయించుకోలేని పేదరికంలో ఉన్న బాధితుడికి వైద్యం చికిత్స కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.22 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన గుత్తుల ధనరాజ్ ఇటీవల గంటి-ఊతకోట రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రెండు కాళ్లకు నాలుగు చోట్ల ఎముకలు విరగడంతో పాటు ఎడమ చెయ్యి కూడా విరిగింది. పేదరికంతో ఇబ్బంది పడుతూ సరైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. దీంతో బాధితుడు భార్య గుత్తుల లక్ష్మికి ఆదివారం రూ.22 వేల నగదు సాయాన్ని సేవా సమితి సభ్యులు అందజేశారు.



లక్ష్మికి సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

గ్రేడ్-3 ఈఓలకు శిక్షణ



గ్రేడ్-3 ఈఓలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో గ్రేడ్-3 ఈఓలకు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఏపీపీఎస్సీలో ఆరుగురు ఉత్తీర్ణత సాధించడంతో గ్రేడ్-3 ఈఓలుగా నియమితులయ్యారు. వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఈఓలు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రేడ్-3 ఈఓలకు ఈఓ స్వామి చిత్రపటం అందజేశారు.

ఎద్దుల కుమ్ములాట



యానాంలో రోడ్డుపై కుమ్ములాడుకుంటున్న ఎద్దులు

యానాం: పట్టణ పరిధిలోని మున్సిపల్ బస్‌కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో ఆదివారం సాయంత్రం రెండు ఎద్దులు కుమ్ములాటకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానికులు ప్రయత్నించినా చాలాసేపు వాటిని ఆపలేకపోయారు. దీంతో యానాం నుంచి రామచంద్రపురం, విశాఖపట్టణం, అమలాపురం, కాకినాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులు కొద్దిసేపు నిలిచిపోయాయి.

అన్నసమారాధన

యానాం: పట్టణ పరిధిలోని రమాభాయినగర్‌లో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. పుదుచ్చేరి ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి మల్లాడి ఉదయలక్ష్మి అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

యానాం: స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఉన్న చేపల మార్కెట్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదివారం శ్రీవినాయక చేపల వర్తక సంఘం అధ్యక్షురాలు నారాయణమ్మ, కామాడి సత్యవతి తదితరులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. మార్కెట్‌లో వ్యక్తిగత కుళాయిల ఏర్పాటు, పాడైపోయిన రబ్బరు మేట్ల మార్పు, విద్యుత్ లైట్ల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వాచ్‌మెన్ లేక రాత్రివేళల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలని కోరారు.

శ్మశానవాటికలో సదుపాయాల కరవు

యానాం: పట్టణ పరిధిలోని టైడల్ లాకు దిగువనున్న హిందూ శ్మశానవాటికలో సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భౌతికకాయాన్ని ఉంచి దహనం చేసే సిమెంట్ బెడ్ చుట్టూ ఉండే రెయిలింగ్ శిథిలమై అంత్యక్రియలకు ఆటంకం ఏర్పడుతుందని, దీనిపై ఎన్నిసార్లు అధికారులు విన్నవించినా స్పందించడం లేదంటున్నారు. దీనికి తోడు శ్మశానవాటికకు వాచ్‌మెన్ లేకపోవడంతో గంజాయి బ్యాచ్‌లు తమ అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

బెట్టింగ్ జోలికెళితే కఠిన చర్యలు

రావులపాలెం: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్-2023 నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెంచామన్నారు. అమాయకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామన్నారు. రావులపాలెం పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని డయల్ 100కు సమాచారమివ్వాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువత బెట్టింగ్ రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

రథ సారథులకు చిరునామా

- ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలలో సుశిక్షణ
- నైపుణ్యవంతులైన డ్రైవర్లను తీర్చిదిద్దడంలో కృషి

అమలాపురం రూరల్: ఆర్టీసీ తన డ్రైవింగ్ కళాశాలలో అత్యుత్తమ శిక్షణతో నైపుణ్యవంతమైన డ్రైవర్లను తీర్చిదిద్దుతున్నారు. కొత్త రవాణా చట్ట ప్రకారం హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే తప్పనిసరిగా ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ కళాశాలలో శిక్షణ పొందాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. దీంట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక డ్రైవింగ్ కళాశాలను నెలకొల్పింది. అమలాపురం ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన డ్రైవింగ్ కళాశాలలో నిష్ణాతులైన డ్రైవర్లను తయారుచేస్తున్నారు.

అమలాపురం ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలను 2021లో ప్రారంభించారు. ఇప్పటివరకూ 7 బ్యాచ్‌ల ద్వారా 112 మందికి శిక్షణనిచ్చి వారికి రవాణా శాఖ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి నాగేశ్వరరావు, డీఎం చల్లా సత్యనారాయణమూర్తి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్ కళాశాలలో శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

శిక్షణ ఇలా

నాలుగు చక్రాల(కారు) లైసెన్స్ తీసుకున్నాక ఏడాది అనుభవంతో ఈ కళాశాలలో ప్రవేశం ఉంటుంది. రూ.23,600 ఫీజు చెల్లించి కళాశాలలో చేరాల్సి ఉంటుంది. రోజూ ఉదయం కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ ఇస్తారు. ఆర్టీసీ బస్సుల్లో యంత్ర పరికరాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పిస్తారు. బస్సులు మరమ్మతులకు గురైతే డ్రైవర్లు వాటిని ఎలా సరిదిద్దుకోవాలో తర్ఫీదునిస్తారు. గ్యారేజ్‌లో నిష్ణాతులైన మెకానికర్లతో అవగాహన కల్పిస్తారు. శిక్షణ బస్సుకు రెండు డ్రైవింగ్ సీట్లు ఉంటాయి. ఓ సీటులో శిక్షణ ఇచ్చే డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్, మరో సీటులో శిక్షణ పొందే డ్రైవర్ కూర్చుంటారు. ట్రాఫిక్ రద్దీలో బస్సు ఎలా నడపాలి, కాలువ, పొలం గట్లు, ఘాటీ రోడ్లపై బస్సులు నడిపే జాగ్రత్తలపై మెళకువలు నేర్పిస్తారు. ఇలా శిక్షణ పొందే ప్రతి అభ్యర్థిని పలు క్లిష్టమైన రూట్లకు తీసుకెళ్లి వారి చేత బస్సును స్వయంగా నడిపిస్తారు. 32 రోజుల పాటు శిక్షణ పూర్తయిన తర్వాత రవాణా శాఖ అధికారి(ఎంవీఐ) హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేస్తారు. ఈ శిక్షణ తరువాత ఆర్టీసీ, ప్రైవేటు రంగాల్లో డ్రైవర్లుగా ఉపాధి పొందవచ్చు.



కళాశాలలో డ్రైవర్లకు శిక్షణ అందించేందుకు ఉపయోగించే ప్రత్యేక బస్సు

నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాం



ఆర్టీసీ శిక్షణ కళాశాల ద్వారా నైపుణ్యవంతులైన డ్రైవర్లను తీర్చిదిద్దుతున్నాం. డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, బస్సుల నిర్వహణ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటివరకూ ఏడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశాం.

– చల్లా సత్యనారాయణమూర్తి, డీఎం, అమలాపురం

శిక్షణ పూర్తి చేశాను



అమలాపురం ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాల ద్వారా 32 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకుని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాను. ఈ కళాశాల ద్వారా అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నారు. శిక్షణలో అన్ని మెళకువలు నేర్చుకున్నాను.

– కోటిపల్లి వీరాస్వామి, డ్రైవర్

ద్వివర్ణం.. నయనానందకరం



కూనవరం మేజర్ డ్రెయిన్‌లో రెండు రంగుల్లో కనిపిస్తున్న నీరు

ఉప్పలగుప్తం: సాధారణంగా నదిలో ప్రవహించే నీరు ఒకే రంగులో కనిపిస్తుంది. అదే రెండు వర్ణాల్లో ప్రవహించడం ఆశ్చర్యమే.. ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధి రాఘవులపేట మీదుగా సముద్ర సంగమంలోకి కూనవరం మేజర్ డ్రెయిన్ కలుస్తుంది. ఈ డ్రెయిన్‌లో ప్రధాన మీడియం డ్రెయిన్ అయిన పాత అయినాపురం నుంచి వచ్చే కాలువలో నీరు ఎగువ ప్రాంతాల్లో వరద నీరు దిగడంతో జలాలు ఎర్రగా ప్రవహిస్తున్నాయి. కూనవరం డ్రెయిన్‌లో దిగే నీరు వ్యవసాయ క్షేత్రాల నుంచి దిగడంతో నలుపు రంగులో కనిపిస్తుంది. ఈ రెండూ కలసిన చోట నీటి ప్రవాహం ద్వివర్ణంలో చూపరులను ఆకర్షిస్తుంది. ఈ దృశ్యం 'సాక్షి' కెమెరాకు ఆదివారం చిక్కింది.